# పందెం

## సామవేదుల వెంకట రామశాస్త్రి



సుబ్బయ్యశెట్టి తన దుకాణంలో విచారంగా కూర్చుని వున్నాడు. తన సమస్య ఎంతకీ తెగలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లుంది.

ఇంతలో ఎదురుగా హడావిడిగా ఎటో వెళ్తున్న అప్పడు కనిపించాడు.

అప్పడికి ముప్పై ఏళ్ళుంటాయి. ఆ వూళ్ళో కూలీ.నాలీచేసుకొని బ్రతికే మనిషి.

"ఏరా అప్పడూ! ఎక్కడి దాకా?" తీరుబడిగా పోచికోలు సంభాషణకి నాంది పలికేడు.

"ఎటూ నేదు బాబయ్యా! పెద బుగత గారేమో టౌనుకెళ్ళి ఎరువుబత్తాలు తోలుకు రమ్మంటే ఎళ్తున్నాను బాబూ" అతి వినయంగా అన్నాడు అప్పడు.

"ఒరే అప్పడూ! నాకు తెలీకడుగుతాను కానీ. ఈ ఫ్యాక్టరీ ఎరువుల్లో ఏం బలం ఉంటుందని అంతా అలా ఎగబడి కొంటారు. మా కాలంలో ఇలాంటివి ఎరుగుదుమా"-సంభాషణని చాంతాడులా సాగదియ్యడానికి ఉపక్రమించాడు శెట్టి.

"అదంతా నాకేటి తెలుత్తాది బాబయ్యా! అయ్యన్నీ పెద్దోళ్ళ ఎవ్వారాలాయె.అయినా నాకు తెలీకడుగుతానుగానీ. పంటలు బాగా పండాలనే కదా బాబయ్యా అంతేసి డబ్బోసి కొంటారు" మాటల్లో శెట్టికేం తీసిపోలేదు అప్పడు.

"వార్నీ. భలే దెబ్బ కొట్టేవే! ఎలాగైనా పూర్వకాలపు తిండి తిన్న వాళ్ళకున్నంత బలం, ఓపిక ఈ కాలం వాళ్ళకేదిరా! ఈ కాలంలో అంతా ఫ్యాక్టరీ ఎరువుల ద్వారా పండించే తిండి తింటున్నారయ్యే" తన పాయింటుని నొక్కి చెప్పాడు శెట్టి.

ఆ మాటలతో అప్పడికి ఎక్కడలేని ఉక్రోషం వచ్చింది.

"అలాగంటే నా నొప్పను బాబయ్యా! ఈ కాలం వోళ్ళు. పూర్వకాలపోళ్ళకి ఏ విధంగానూ తీసిపోరు. మరీ సెప్తే ఈ కాలం వోళ్ళే కండబలిమి కలోళ్ళు" తను నమ్మిన సత్యాన్ని దృఢంగా నొక్కి చెప్పేడు.

"ఓ సోళ నాకేం చెప్పకురా అప్పడూ! పూర్వకాలంలో మీ నాన్న ఎంకడైతే ఆ బయటున్న ఉప్పు బస్తాలన్నీ పావుగంటలో లోపల పడేసేవాడు. ఈ కాలం వాళ్ళకి అంత సత్తువేది?"వేళాకోళంగా అని ఋళక్కున నవ్వేడు శెట్టి.

దాంతో అప్పడి కోపం నసాళాని కంటింది.

"మీరన్నదానికి నానొప్పను బాబయ్యా. కావాలంటే పందెం ఒడ్డిగల్ను. నాను ఈ బస్తాలన్నీ పావుగంటలో లోన బడీగల్ను" ఆవేశంగా అన్నాడు అప్పడు.

"శభాష్‌రా అప్పడూ! ఇన్నాళ్ళకి నాతో పందెం వేసే మొనగాడివి బయలుదేరావ్! సర్లే! నువ్వన్నట్లు పందెంలో నువ్వు నెగ్గితే పొగాకు కాడిస్తాను. నేను నెగ్గితే నువ్వు మా ఇంట్లో ఒకరోజంతా జీతం లేకుండా పనిచెయ్యాలి" పందెం షరతులు వివరించాడు శెట్టి.

మారు మాట్లాడకుండా అందుకొప్పుకున్నాడు అప్పడు. ఆ వెంటనే రంగంలోకి దూకేడు.

గబగబా ఆ బస్తాలన్నీ పది నిమిషాల్లోనే లోపల పడేసి పందెం గెల్చుకొని శెట్టందించిన పొగాకు కాడతో విజయ గర్వంతో తృప్తిగా బయటపడ్డాడు.

సుబ్బయ్యశెట్టి పది రూపాయలదాకా ఖర్చయ్యే తన సమస్య పావలా పొగాకు కాడతో పరిష్కారమైనందుకు తృప్తిగా నిట్టూరుస్తూ కొట్లో కూలబడ్డాడు.